25 వసంతాల రచయిత

యండమూరి వీరేంద్రనాథ్ రచయితగా కలంపట్టి ఇరవై అయిదు సంవత్సరాలు పూర్తి కావొస్తున్న సందర్భంలో, ప్రముఖ సాంస్కృతిక సంస్థలు రజతోత్సవ సభలు ఏర్పాటు చేస్తున్నాయి.

వీరేంద్రనాథ్ 'తులసిదళం' రచయితగానే చాలామందికి తెలుసు. ఆ తరువాతే ఆయన పాపులర్ అయ్యారని కాబోలు ఆ ముద్రపడింది. తులసిదళం 1980 ప్రాంతాల్లో ప్రచురితమైంది. కానీ వీరేంద్రనాథ్ మొదటి రచన అంతకుముందు పుష్కరం క్రితం ప్రచురితమైంది. నాటకరంగంతో పరిచయం వున్నవారికి 1970–80 మధ్య వీరేంద్రనాథ్ నాటక రచయితగా తెలుసు.

నాటకాలు వ్రాయకముందు వీరేంద్రనాథ్ నాలుగయిదు కథానికలు వ్రాశారు. చందమామలో కథలు వ్రాయటం తన హాబీగా ఆయన పేర్కొన్నారు.

ఆ రోజుల్లో చందమామ సంపాదకవర్గంవారే బేతాళ కథలు వ్రాసేవారు. లేదా వచ్చిన కథల్లో అనువైనదాన్ని బేతాళ కథగా మలచి ప్రచురించేవారు. మొత్తం కథనే ఆ రూపంలో వ్రాయటం ప్రారంభించింది వీరేంద్రనాథే. ఆ చందమామ కథలు చదువుతూ సంపాదకవర్గంతో "ఈ రచయిత ఎవరో త్వరలో పైకి వస్తారు" అని కొడవగంటి కుటుంబరావు గారు అనటాన్ని తన మొట్టమొదటి అపూర్వ అనుభవంగా వీరేంద్రనాథ్ ఇటీవలే ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

1969లో ప్రచురితమైన ఈ కథల్లో ఈనాటి వేరేంద్రనాథ్ శైలి, శిల్పం స్పష్టంగా కనిపిస్తాయి. అంతేకాకుండా, ఆయన రచనల్లో వుండే (తార్కానికి అందని) క్లిష్టత కూడా కనిపిస్తుంది. చదవండి—

రాజీ

పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు తిరిగి వెళ్ళి, చెట్టుపై నుంచి శవాన్ని దించి భుజాన వేసుకుని, ఎప్పటిలాగే మౌనంగా శ్మశానం కేసి నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు "రాజా, ఒక్కొక్క సారి విశ్వప్రయత్నంవల్ల లభ్యంగాని కార్యసిద్ధి దానంతట అదే సంభ విస్తుంది. ఇందుకు నిదర్శనంగా నీకు ప్రతాపుని కథ చెపుతాను. శ్రమ తెలియకుండా విను" అంటూ ఇలా చెప్పసాగాడు :—

సుదర్శనుడనే రాజు కోసల దేశాన్ని పాలించే కాలంలో విదేహ దేశాన్ని జయదేవుడు పాలించేవాడు. ఆ రెండు దేశాలకూ మధ్య సత్సం బంధాలు లేవు. కావటానికి కోసలదేశమే పెద్దదీ, బలసంపన్నమైనదీ అయినా, తూర్పున వున్న దేశాలతో వర్తక సంబంధాలు పెట్టుకోవటానికి విదేహ పెద్ద అడ్డంకిగా వుండటంచేత, ఈ వైరంవల్ల కోసలకే హెచ్చు ఆర్థిక నష్టం కలుగుతూ వుండేది.

విదేహను జయించి లొంగదీసుకోవటం కోసలకు ఎంతో లాభ కరం. కాని సుదర్శనుడు పిరికివాడు. దానికి తగ్గట్టు విదేహ రాజైన జయదేవుడు మహా పరాక్రమశాలి. కత్తియుద్ధంలో అతను పదహారు కళలు ప్రదర్శించగలడని ప్రతీతి వుండేది. అందుచేత సుదర్శనుడు విదేహతో యుద్ధానికి జంకాడు. అయినా విదేహను జయించాలన్న కోరిక మాత్రం ఆయనలో చావలేదు.

సుదర్శనుడికి ప్రతాపుడనే కొడుకు పుట్టాడు. తండ్రిలాగా అతను పిరికివాడు కాడు. మంచి శౌర్యపరాక్రమాలు గలవాడు. యుక్తవయస్కుడయేనాటికి అన్ని యుద్ధ విద్యలలోనూ అంతులేని ప్రావీణ్యం వచ్చింది. ప్రత్యేకించి కత్తి యుద్ధంలో అసాధారణ ప్రజ్ఞ సంపాదించుకున్నాడు.

సుదర్శనుడికి అవసానకాలం సమీపించేనప్పు డాయన తన కొడుకును దగ్గరికి పిలిచి, "నాయనా, నా చిరకాల వాంఛితం తీరుస్తానని మాట ఇయ్యి. జయదేవుడి ముందు నిలిచే శక్తిలేక నేను విదేహ మీదికి యుద్ధానికి వెళ్ళలేదు. నువ్వు మహావీరుడివి. జయదేవుడు వయసు మళ్ళినవాడు. నువు అతనిపై యుద్ధంచేసి, గెలిచి మనకు పక్కలో బల్లెంలా వున్న విదేహను కోసలలో కలుపుకో! ఈ పని నెరవేరినదాకా విశ్రమించనని మాట ఇయ్యి" అన్నాడు.

ప్రతాపుడు తండ్రి కోరిక తీర్చుతానని ప్రమాణంచేశాడు. తరవాత సుదర్శనుడు గతించటమూ, ప్రతాపుడు రాజ్యాభిషేకం చేసుకోవటమూ జరిగింది.

కొంతకాలం రాజ్యాంగాన్ని చక్కదిద్దు కోవటంతోనే ప్రతాపుడికి సరిపోయింది. అయినా అతను తండ్రికి ఇచ్చినమాట మరిచిపోలేదు. మరిచిపోకపోగా అతనికి విదేహ మీదికి దండెత్తి వెళ్ళాలనీ, మహావీరుడని పేరుపడిన జయదేవుణ్ని జయించి, అంతకన్న గొప్ప వీరుడనిపించుకోవాలనీ, తన రాజ్యానికి ప్రతిబంధకంగా వున్న విదేహ సింహాసనం కూడా తానే అధిష్ఠించాలనీ ఎంతో ఉబలాటంగా ఉన్నది.

అయినా ప్రతాపుడు విదేహపైకి సైన్యాన్ని నడిపించే ప్రయత్నం ప్రారంభించలేదు. అందుకు కారణం జయదేవుడి కుమార్తె చారుమతి.

చారుమతి చక్కదనం గురించి ప్రతాపుడు ఎంతగానో విని, ఆమెనే పెళ్ళాడాలని ఏనాడో నిశ్చయించుకున్నాడు. కాని వారి వివాహం జరగటం సాధ్యమయ్యే విషయం కాదు. అందుకు ప్రతాపుడు చేయదగిన ప్రయత్నాలు రెండే రెండు: ఒకటి విదేహపైకి దండెత్తిపోయి, జయదేవుణ్ణి

జయించి, అతని కుమార్తెను బలాత్కారంగా వివాహం చేసుకోవటం, రెండు తాను తండ్రి ముందు తీసుకున్న ప్రమాణాన్ని గాలికి వదిలేసి; జయదేవుడితో ఏదో విధంగా రాజీపడి, చారుమతిని తనకిచ్చి పెళ్ళిచెయ్యమని వేడుకోవటం.

బలాత్కార వివాహాన్ని చారుమతి నిరసించవచ్చు. తన వేడికోలును జయదేవుడు నిరాకరించవచ్చు.

అందుచేత ప్రతాపుడికి గొప్ప విషమ సమస్య తటస్థపడింది. ఆ పరిస్థితిలో ప్రతాపుడు మూడోమార్గం ఒకటి చూసుకున్నాడు. అతను రాచ కార్యాలన్నిటినీ కొంతకాలంపాటు మంత్రులను చూస్తూ వుండమని, మారు వేషంవేసుకుని, తన పేరు ప్రసేనుడని మార్చుకుని విదేహ దేశం ప్రవేశించాడు.

అతను తగిన అవకాశం కోసం వేచివుండి చారుమతిని కలుసుకుని, తానెవరో చెప్పి, తనకు ఆమెపైగల ప్రేమ వెల్లడించి, ఆమె అభిప్రాయం అడిగాడు. చారుమతి కూడా అతన్ని గురించి విని ఉన్నది. తమ దేశాల మధ్య శత్రుత్వమే లేకపోతే తమ వివాహం సులువుగా జరిగి ఉండేదిగదా అనుకుంటూ వచ్చింది. అందుచేత ఆమె అతనికి తన సమ్మతి క్లుప్తంగా తెలియజేసింది.

ఇక జయదేవుడి సమ్మతి సంపాదించవలసి వున్నది. అందుకు కూడా ప్రతాపుడొక పద్ధతి ఆలోచించాడు. అది చాలా హేయమైన పద్ధతే-కాని దానిద్వారా తండ్రి కోరిక నెరవేరుతుంది. ఆ పద్ధతి ఏమంటే, తాను విదేహపై దాడిచేసి దాన్ని గెలిచే బదులు, జయదేవుణ్నే కోసల గెలవనివ్వటం!

ప్రతాపుడు మర్నాడు రాజును ఏకాంతంగా కలిసి మాట్లాడటానికి అనుమతి సంపాదించాడు. జయదేవుడు అతన్ని తన సమక్షానికి రానిచ్చి "ఏమిటి నువ్వు నాతో మాట్లాడదలిచిన విషయం?" అన్నాడు.

"మహారాజా, నాపేరు ప్రసేనుడు. రాజవంశంవాణ్ని. చాలా కాలంగా కోసలరాజు కొలువులో వున్నాను. అక్కడి గుట్టుమట్లన్నీ నాకు తెలుసును. తమరు కోసలను జయించదలిస్తే, అందుకవసరమైన సహాయ మంతా నేను తమకు చెయ్యగలను" అన్నాడు ప్రతాపుడు.

తాను తలుచుకుంటే జయదేవుడు రక్తపాతం లేకుండానే కోసలను జయించగలడు. ఈ ఉపకారం చేసినందున ఆయన తనకు తన కుమార్తె నివ్వటానికి సందేహించడు. తనకూ చారుమతికీ వివాహం అయిన మరు క్షణం రెండు రాజ్యాలూ ఒకటవుతాయి, రెంటికీ తనే రాజవుతాడు. తండ్రి కోరికా నెరవేరుతుంది, తన కోరికా నెరవేరుతుంది.

ప్రతాపుడి ఈ ఎత్తుగడ పారలేదు. దానికి కారణం, అతను చారు మతితో మాట్లాడినప్పుడామె ముఖ్య పరిచారిక అంతా విన్నది. ఆమెను ప్రతాపుడు లక్ష్యపెట్టలేదు. ఈరోజు ప్రతాపుడు రాజుతో మాట్లాడటానికి రహస్య మందిరంలోకి పోవటం ఆ పరిచారికే చూసి, రహస్యంగా వారి మాటలన్నీ విన్నది. జయదేవుడు "ఆలోచించి చెబుతాను. నువ్వు ప్రస్తుతం రాజభవనంలోనే వుండు" అని ప్రతాపుణ్ని అవతలికి పంపగానే ఆమె రాజు వద్దకు వచ్చి, "మహారాజా, ఆ యువకుడి మాటలు నమ్మకండి. అతను కోసల దేశపు రాజు" అన్నది.

జయదేవుడు తోక తొక్కిన తాచులాగా అయిపోయి, ప్రతాపుణ్ని బంధించి, చెరసాలలో పెట్టించమని ఉత్తరు విచ్చాడు.

ఈ సంగతి తెలిసి చారుమతి ఎంతో దుఃఖించింది. ఆమె తన తండ్రి వద్దకు వెళ్ళి ప్రతాపుడు ద్రోహబుద్ధితో వచ్చినవాడు కాడనీ, తనపై ప్రేమ ప్రకటించుకోవడానికి నానా అగచాట్లూ పడ్డాడనీ, అతన్ని వెంటనే చెర విడిపించి, తమ కిద్దరికీ వివాహం చెయ్యమనీ దీనంగా వేడుకున్నది.

"ఆ నీచుడి పక్షాన నా కర్తవ్యం బోధించకు. నిన్ను ఎలాటివాడి కిచ్చి పెళ్ళిచెయ్యాలో నాకు బాగా తెలుసు" అని జయదేవుడు తన కుమార్తెను విదిలించి పారేశాడు.

ఆ సాయంకాలమే ఆయన చెరసాలకువెళ్ళి, ప్రతాపుణ్ని కలుసుకుని "బుద్ధిహీనుడా, ఈ రాజ్యంలో అడుగుపెట్టటం అపాయమని తెలిసికూడా ఎందుకు అడుగుపెట్టావు? ఏ కారణంచేతనైనా రాగోరితే బాహాటంగా రాక పిరికిపందలాగా మారువేషంలో ఎందుకు వచ్చావు? ఇప్పుడు నేను నీ తల తీయిస్తే అడ్డెవరు?" అని అడిగాడు.

ప్రతాపుడి ముఖంలో భయలక్షణాలు కనబడతాయని ఆయన అనుకున్నాడు. కాని అలాటిదేమీజరగలేదు. ప్రతాపుడు చిన్నగా నవ్వి, "నేను మీరాజ్యంలోకి ప్రచ్ఛన్నంగావచ్చినది నా క్షేమంకోసం కాదు. మీ రాజ్యం క్షేమంకోరి. నేను బాహాటంగా రాదలిస్తే సైన్యాలతోనే రావాలి. అదే జరిగితే మీ రాజ్యం ఒక్కరోజులో శ్మశానంగా మారిపోతుంది. నేను వచ్చినది మీ కుమార్తె చారుమతి హృదయం తెలుసుకోవటానికి, మీ రాజ్యాన్ని నేలమట్టం చెయ్యటానికి కాదు" అన్నాడు.

"నా కుమర్తె హృదయం తెలుసుకున్నావా?" అని జయదేవుడు అడిగాడు.

"తెలుసుకున్నాను. నన్ను పెళ్ళాడాలన్న వాంఛ ఆమెలో గాఢంగానే ఉన్నది" అన్నాడు ప్రతాపుడు.

"పిరికిపందవు! నన్ను జయించలేక నా కుమార్తెను పెళ్ళాడి, ఆ విధంగా నా రాజ్యం హరించుదామనుకున్నావు. నా రాజ్యం నేలమట్టం చేస్తానని ప్రగల్భాలెందుకు?" అన్నాడు జయదేవుడు.

"మీ కుమార్తెను పెళ్ళాడటంతోబాటు మనరాజ్యాలురెండూఏకంకావాలన్న కోరిక కూడా నాకున్నది. అలా జరగాలంటే నేను మీ రాజ్యమైనా గెలవాలి; మీచేత నా రాజ్యాన్ని గెలవనివ్వటమైనా చేయాలి. నా రాజ్యం గెలవటానికి మీకు సులభోపాయం చెప్పాను. అందులో ఏదో ద్రోహం ఉన్నట్టు మీరు నన్ను చెరపెట్టించారు" అన్నాడు ప్రతాపుడు.

"నువ్వు ఎంతో పిరికిపందవైఉండబట్టే నీ రాజ్యాన్ని నాకు కానుక పెట్టాలని చూడవు. నీకు శిరచ్ఛేదమే తగినశిక్ష" అన్నాడు జయదేవుడు.

ప్రతాపుడు ఆశ్చర్యంగా, "మీరు మహా పరాక్రమవంతులని దేశదేశాలా చెప్పుకుంటున్నారు. శత్రువును నిరాయుధుడుగా పట్టి శిరశ్ఛేదం చేసేవాడికన్నా పిరికిపంద ఎక్కడుంటాడు?" అన్నాడు.

జయదేవుడి ఆగ్రహం నషాళం అంటింది. ఆయన ఆ కోపాన్ని నిగ్రహించుకొని "నేను ఉదారస్వభావంతో నిన్ను విడిచిపుచ్చితే ఏం చేస్తావు?" అన్నాడు.

"మీరు అలాటి సాహసమే చేస్తే, నేను మా దేశానికి వెళ్ళి సేనలను తరలించుకు వచ్చి మీ దేశాన్ని నామరూపాలు లేకుండా చేసేస్తాను. వీలుపడితే ద్వంద్వ యుద్ధంలో మీ ప్రాణాలు తీసేస్తాను" అన్నాడు ప్రతాపుడు.

జయదేవుడి కళ్ళు మెరిశాయి. ఆయన ప్రతాపుడితో "ఇప్పుడే నీకు వీలు కలుగజేస్తాను. నాతో ద్వంద్వ యుద్ధం చెయ్యి" అన్నాడు.

అప్పటికప్పుడే ప్రతాపుణ్ణి చెరవిడిపించారు. జయదేవుడు శస్త్ర చికిత్సకులను రప్పించి, ప్రతాపుడికి ఒక కత్తి యిచ్చి, తానొక కత్తితీసుకుని యుద్ధానికి సిద్ధంగా నిలబడ్డాడు.

యుద్ధంలో చాలాసేపు జయదేవుడూ, ప్రతాపుడూ సమ ఉజ్జీలుగా కనబడ్డారు. జయదేవుడు ప్రదర్శించిన కళలన్నిటికీ ప్రతాపుడు ప్రతిక్రియలు చేశాడు. కాని ఆఖరులో జయదేవుడు ప్రతాపుడి చేతి కత్తిని ఎగరగొట్టాడు.

ప్రతాపుడు అమితాశ్చర్యంతో "ఈ కళ నేనెన్నడూ ఎరగనే!" అన్నాడు.

జయదేవుడు ప్రతాపుడి భుజంతట్టి, "అల్లుడూ నువ్వు నేర్చుకోవలసిన కళలు ఇంకా ఒకటి రెండున్నాయి. వాటిని నీకు అల్లుడి కట్నంకింద ఇచ్చుకుంటాను. నీ వివాహానికి తరలిరమ్మని మీ దేశానికి కబురు పంపు" అన్నాడు.

మంచి ముహూర్తాన ప్రతాపుడికీ, చారుమతికీ వివాహం అయిపోయింది. కోసల, విదేహ రాజ్యాలు ఏకమయ్యాయి. కాలక్రమాన రెంటికీ ప్రతాపుడే రాజై, తన తండ్రి చివరి కోరికను పూర్తిచేశాడు.

బేతాళుడీకథచెప్పి "రాజా, నాకొకసందేహం. జయదేవుడు ప్రతాపుణ్ణి ద్వంద్వ యుద్ధంలో ఓడించికూడా, ఆకస్మికంగా అతన్ని తన అల్లుడుగా చేసుకోవటానికి ఎందుకు నిర్ణయించాడు? తన కుమార్తె అతన్ని ప్రేమించిందనా? లేక ఎప్పటికైనా అతను తన రాజ్యాన్ని మట్టు పెడతాడనా? ఒకవేళ ఇది ఆకస్మిక నిర్ణయం కాకపోతే, తన అల్లుణ్ని చేసుకోదలచి కూడా ఆయన ప్రతాపుడితో ఎందుకు ద్వంద్వ యుద్ధానికి తలపడ్డాడు? ఈ ప్రశ్నలకు సమాధానం తెలిసికూడా చెప్పకపోయావో నీ తల పగిలిపోతుంది" అన్నాడు.

దానికి విక్రమార్కుడు "జయదేవుడు ప్రతాపుడికి తనకూతురునిచ్చి చెయ్యాలని నిర్ణయించినది ద్వంద్వయుద్ధం అయ్యాకనే. ప్రతాపుడి తండ్రి జగత్ప్రసిద్ధుడైన భీరువు, ప్రతాపుడి ప్రవర్తనకూడా పిరికివాడి ప్రవర్తనలాగే జయదేవుడికి కనపడింది. అతను మహావీరుడో, పిరికివాడో తేల్చుకోవటానికే జయదేవుడు అతనితో ద్వంద్వయుద్ధం సాగించాడు. ప్రతాపుడు ద్వంద్వ యుద్ధంలో జయదేవుడికి సమానం కాకపోయినా, అతను

గొప్ప వీరుడన్నది మటుకు రూఢి అయిపోయింది. తను ఓడిపోయాక కూడా అతను ఓడినందుకు దుఃఖించక, కత్తి యుద్ధంలో తాను ఎరుగని లాఘవాన్ని జయదేవుడిలో చూసి అబ్బురం చెందాడు. అదీ నిజమైన వీరుడి లక్షణం. అందుకే జయదేవుడు తన కుమార్తెను అతనికిచ్చి చెయ్యటానికి నిశ్చయించాడు" అన్నాడు.

రాజు కీవిధంగా మౌనభంగం కలగగానే బేతాళుడు శవంతోసహా మాయమై తిరిగి చెట్టెక్కాడు. (చందమామ-69)

వీరేంద్రనాథ్ రచనల్లో పాఠకుల్లో ఆకర్షించేవి లెఖలు, రచయిత పరిజ్ఞానం, పాత్రల (ముఖ్యంగా హీరో హీరోయిన్‌లు వేసే) ట్రిక్కులు వగైరా. ఇరవై సంవత్సరాల క్రితం కథల్లోనే అలాటి గిమిక్స్ మనకి కన పడతాయి. ఉదాహరణకి ఈ రెండు కథలూ చదవండి-

....★....